## క్లుప్తంగా

### కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు ఓట్ చోర్.. గద్దె ఛోడ్ కార్యక్రమంలో భాగంగా గురువా రం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కంది శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ చౌక్ వరకు ర్యాలీ చేపట్టారు. నాయకులు గిమ్మ సంతోష్ మాట్లాడుతూ భారీగా ఓట్ల తొలగింపులో బీజేపీ ఎలక్షన్ కమిషన్‌లు కుమ్మక్కయ్యాయని ఆరోపించారు.

### హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక



లక్కీడ్రా నిర్వహిస్తున్న అడిషనల్ కలెక్టర్

కైలాస్‌నగర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామంతాపూర్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో ఎస్సీ విద్యార్థి ప్రవేశం కోసం గురువారం లక్కీడ్రా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని అడిషనల్ కలెక్టర్ ఛాంబర్‌లో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రాలో జైనథ్ మండల కేంద్రానికి చెందిన చిల్క నిధిజ్ఞను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీడీవో సునీత కుమారీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, ఏఎస్‌డబ్ల్యూవో నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మహిళల రక్షణ కోసమే షీటీం



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

నేరడిగొండ: మహిళలు, యువతుల రక్షణ కోసమే షీటీం పని చేస్తుందని షీటీం సభ్యులు వాణి, ఆర్.మోహన్, మహేశ్, రోహిణిలు అన్నారు. గురువారం మండలంలోని బుగ్గారం జూనియర్ కళాశాలలో అవగాహన కల్పించారు. మహిళలు, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంట్లోగానీ, పని ప్రదేశాల్లో గానీ మహిళలను వేధించినా.. రాంగ్ కాల్స్ చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

### క్రమశిక్షణతో మెలగాలి

బేల: విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణతో మెలగాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రావుత్ మనోహర్ అన్నారు. గురువారం మండలంలోని సోన్‌కాస్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆడనేశ్వర ఫౌండేషన్ చైర్మన్ సతీష్ పవార్ ఆధ్వర్యంలో 80 మంది విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెస్రం జనార్దన్, ప్రమోద్‌రెడ్డి, ఠాక్రే గంభీర్, తేజ్‌రావు, కోడే విపిన్, ఠాక్రే మంగేష్, గుండవార్ అకాష్, గోడం సునీల్ పాల్గొన్నారు.

### యూనిఫాం అందజేత

ఇచ్చోడ: మండలంలోని చించోలి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం ప్రభుత్వం నుంచి వచ్చిన యూనిఫాంను అందచేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### 'కించపరిచే విధంగా మాట్లాడొద్దు'

ఉట్నూర్‌రూరల్: ఎమ్మెల్యే హోదాలో ఉండి ఇతరులను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదని బీజేపీ జాతీయ నాయకులు శ్రీరాం నాయక్, లింగాగౌడ్‌లు అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. దివంగత నేత రాథోడ్ రమేశ్ ఈప్రాంతానికి ఏమి సేవలు చేశారో అందరికీ తెలుసన్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకు రాజకీయం చేసింది తప్పా.. ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు బింగి వెంకటేశ్, కొండేరి రమేశ్, బొడ్డు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్లు

కైలాస్‌నగర్: ప్రభుత్వరంగ సంస్థల భవనాల్లో విద్యుత్ బిల్లులను తగ్గించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు నిర్ణయించిందని మున్సిపల్ ఇంజనీర్ పేరిరాజు అన్నారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లు, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ ఫీల్డ్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాలలు, అంగన్వాడీలు, కళాశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాల్లోని భవనాలు, వాటి స్లాబ్ విస్తీర్ణం వంటి సమాచారాన్ని పూర్తిస్థాయిలో సేకరించారు.

# ప్రమాదకరంగా స్తంభాలు

- భయాందోళనలో కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణ కేంద్రంలోని ఐబీ చౌరస్తా, పాత బస్టాండ్ సమీప కాలనీల్లో ఇనుప విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. వర్షాకాలం కావడంతో వర్షాలు కురుస్తున్న సమయంలో స్పార్క్ వచ్చి మంటలు చెలరేగుతున్నాయని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉట్నూర్ ఐబీలో ఇనుప విద్యుత్ స్తంభం ఒకవైపు వంగి ఉంది. అదే విధంగా పాత బస్టాండ్ సమీప కాలనీలో రోడ్డుగుండా డ్రెయినేజీలు నిర్మించగా.. కాలువల్లో స్తంభాలు పేరుకుపోయాయి. వర్షాలు కురుస్తుండటంతో స్తంభాలకు విద్యుత్ సరఫరా అయి ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అవసరం లేని ప్రాంతాల్లో స్తంభాలు వేస్తూ తమ పనిని సాఫీగా కొనసాగిస్తున్న అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టి ప్రమాదాలు జరగక ముందే స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఐబీ ప్రాంతంలో వంగిన స్తంభం



పాతబస్టాండ్ కాలనీలో..

### అధికారులు స్పందించాలి



మా ఇంటి ఎదుట డ్రెయినేజీలో ఇనుప స్తంభం ఉంది. స్తంభం ఉన్న చోటునే డ్రెయినేజీ నిర్మించారు. వర్షాకాలం కావడంతో డ్రెయినేజీలో వరద నీరు ప్రవహిస్తుంది. ఇంత ప్రమాదకరంగా ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు సమస్యలను పరిష్కరించాలి. – మోసీన్, పాత బస్టాండ్ కాలనీవాసి

# అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

తలమడుగు: అర్హులైన ప్రతిఒక్కరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు అందించడం జరుగుతుందని మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పల్సి(బి)తండా గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టిఇవ్వలేదన్నారు. ఏడాది కాలంలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న వారికి 15 రోజుల్లోనే బిల్లు చెల్లించడం జరుగుతుందన్నారు. పల్సి(బి) తండా గ్రామంలో 12 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడం జరుగుతుందన్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ బాబన్న, వెంకన్న యాదవ్, తదితరులు ఉన్నారు.



ఇళ్లను పరిశీలిస్తున్న గోక గణేశ్‌రెడ్డి

జైనథ్: అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని జైనథ్ మార్కెట్ కమిటీ చర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి అన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న ఇండ్లను గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే నిరుపేదలు లబ్ధి పొందుతున్నారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రుకేష్ రెడ్డి, నాయకులు బద్దం సురేశ్‌రెడ్డి, వెంకన్న యాదవ్, ఎస్.కె అబ్బు, తదితరులు పాల్గొన్నారు.

### కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్: సీపీఐ ఆదిలాబాద్ పట్టణ నూతన కార్యవర్గాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా చంద్రమౌళి, సహాయ కార్యదర్శిగా తబ్రేజ్ ఖాన్, సభ్యులుగా రాజు, వెంకటస్వామి, కిష్టయ్య, వసంత్, రాజన్న, విష్ణు, కౌన్సిల్ సభ్యులుగా మనోజ్, జ్యోతి, మల్లేష్, గణపతి, బాబు ఖాన్, ఖాసిమ్, చిరంజీవి, ముజీబ్, నందు, మధుకర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, సురేశ్‌చంద్ర, కృష్ణస్వామి, మెస్రం భాస్కర్, చిల్కదేవిదాస్ పాల్గొన్నారు.

# 'కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి'

నేరడిగొండ: కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి అడే గజేందర్ అన్నారు. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. గురువారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో వారికి కండువాలు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని గత ఎంపీ ఎన్నికల్లో తెలిసిందన్నారు. బీఆర్ఎస్‌లో మైనారిటీలకు ప్రాధాన్యత లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు అడే వసంతరావు, కుంట శంకర్, బద్దం పోతారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నాయిడి రవి, పాల శంకర్, రాహేల్, గజ్జల అశోక్, వసంత్ రావు, ఇసాఖ్, కపిల్ పాల్గొన్నారు.

**పరామర్శ**

కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి అడే గజేందర్ మండలంలోని పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. గురువారం మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన రాంబాగ్ల అరుణ్ కుమార్, కమ్మరి రమణ కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని వారి నివాసాలకు చేరుకున్నారు. ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గజేందర్

- యువ సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన యువ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా.. గురువారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో వారికి కండువా లు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో యువకులు రాకేశ్, కుడల మహేశ్, చౌలమద్ది రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఊరూరా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ఇచ్చోడ: జెండాలు పంపిణీ చేస్తున్న నాయకులు



సోనాలలో..



తాంసి: ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఇచ్చోడ: మండలంలోని మాదపూర్ గ్రామంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ.. ప్రజల్లో జాతీయభావం పెంపాదించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించనట్లు తెలిపారు. అనంతరం జాతీయ జెండాలను పంపిణీ చేశారు.

బోథ్: సొనాల మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. పలు వీధులగుండా జాతీయ జెండాలు చేతపట్టి నినాదాలు చేశారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి వద్ద జాతీయ జెండాను ఎగురవేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీవి. రమణ, తాటిపెల్లి రాజు, బోరె రవీందర్, సుభాష్ సూర్య, మానాల శేఖర్ పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలో దేవపూర్, బరంపూర్, సుంకిడి, తలమడుగు గ్రామాల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ జాతీయ జెండాను ఇంటిపై ఎగరవేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు కిరణ్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బీజేపీ నాయకుడు గణేష్, రాములు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో బీజేపీ నాయకులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా అనే నినాదంతో బీజేపీ నాయకులు ర్యాలీ చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రకిరణ్, సదానంద్, నారాయణ, సుధాకర్, శేఖర్, నంద్ పాల్గొన్నారు.

సాత్నాల: జాతీయ జెండాను ప్రతీ ఇంటిపై ఎగరవేయాలని లక్ష్యంతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గురువారం భోరజ్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జాతీయ జెండాలు పంపిణీ చేశారు. స్వతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రతి ఇంటిపై జెండా ఎగరవేయడం దేశభక్తి సంకేతమన్నారు. సన్నీ గాజుల, అశోక్ రెడ్డి, రమేశ్, వికాస్ వాంకడె, అలాల్ దేవన్న, ప్రదీప్ రెడ్డి, దేవన్న, నివల్కర్ గజానన్, శ్రీనివాస్, శంకర్, గంభీర్ పాల్గొన్నారు.

జైనథ్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా జెండా కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మండల అధ్యక్షుడు లోకకర్ణకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశానికి ఎంతో సేవ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రతాప్ యాదవ్, ఏనుగు రాకేశ్‌రెడ్డి, సీడం రాకేశ్, రాందాస్, సమా రమేశ్‌రెడ్డి, లింగారెడ్డి, సూర్యకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

గుడిహత్నూర్: జాతి ఐక్యత కోసమే తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి లక్ష్మణ్ కేంద్రే, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడు భోసారే గణేష్ పాటిల్, కేంద్రే శివ, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు లేకుండా చూడాలి

ఇంద్రవెల్లి: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్ అన్నారు. గురువారం మండలంలోని పిట్టబొంగరం ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి తరగతుల నిర్వహణ, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్న తీరు, వసతి గృహంలో సౌకర్యాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం మండలంలోని దస్నాపూర్‌లో ఈజీఎస్ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్‌వలు విఠల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్

# ప్రభుత్వమే బాధ్యత వహించాలి

ఆదిలాబాద్‌టౌన్: గాదిగూడ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త రాధకు పని ఒత్తిడి కారణంగా బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను గురువారం నాయకులతో కలిసి పరామర్శించారు. ఫొటో క్యాప్చర్, ఈకేవైసీ, తదితర పనులు చేయాలని అధికారులు ఒత్తిడి చేయడంతో హైటెన్షన్‌కు గురైనట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు పనికితగ్గ వేతనం ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని అన్నారు. పరామర్శించిన వారిలో నాయకులు గంగన్న, స్వామి, బొజ్జ గంగారాం, తదితరులు ఉన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్త రాధ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న నాయకులు

# బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్చోడ: గ్రామీణ, పట్టణ ప్రజలు బ్యాంకులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ బ్యాంక్ రీజినల్ మేనేజర్ రామచంద్రరావు అన్నారు. గురువారం మడలంలోని తలమద్రి గ్రామంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సామాజిక భద్రత బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సైబర్ క్రైం మోసాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ మేనేజర్ ఉత్పల్‌కుమార్, ఆర్‌బీఐ సిబ్బంది విజయ్, సునీల్, పంచాయతీ కార్యదర్శి నరేశ్, వర్ని సంతోష్, అరవింద్‌గౌడ్, ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామచంద్రరావు

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

నేరడిగొండ: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్ రెడ్డి, సాయన్న, ఏఎన్‌ఎం అమ్మీబాయి, ఫార్మసిస్ట్ ఓంప్రకాశ్, ఆర్‌బీఎస్‌కే బృందం, ఏఎన్‌ఎం సుజాత, హాస్టల్ ఏఎన్‌ఎం నాగలక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

### 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 18న జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద పాపన్న గౌడ్ జయంతి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌడ కులస్తులు, బీసీ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### 18న జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈనెల 18న జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామేశ్వర్ ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ (అండర్–15), జూనియర్ (అండర్–17) విభాగాల్లో బాలురకు ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల నుంచి 16 మంది ( 14 ప్లేయర్స్, 2 గోల్ కీపర్స్) ని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

**రేపు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు..**

ఎస్జీఎఫ్ జిల్లాస్థాయి వాలీబాల్ అండర్ 15 బాల, బాలికల ఎంపిక పోటీలు ఈనెల 16న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీఈవో కుష్బూ గుప్తా, ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామేశ్వర్ ప్రకటనలో తెలిపారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో శనివారం ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 2010 జనవరి 1 తర్వాత జన్మించిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు.

### సీహెచ్‌సీ తనిఖీ

బోథ్: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోథ్ ఆసుపత్రిలో రోగులను పట్టించుకోవడం లేదని, సిబ్బంది రోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని, కొంతమంది కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయపాలన పాటించాలన్నారు.

# ప్రభుత్వ భూములను పరిరక్షించండి

సాత్నాల: భోరజ్ మండలంలోని గూడ, హత్తిగాట్ శివారు ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని పరిరక్షించాలంటూ బీఆర్ఎస్ నాయకులు గురువారం తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు. హత్తిగాట్ శివారంలోని 41,41/2 అక్రమ రిజిస్ట్రేషన్ పైన విచారణ చేయాలని డిమాండ్ చేశారు. గౌరీ శంకర్ భూముల వివరాలు సేకరించి ప్రజలు మోసపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ పురుషోత్తం యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ విజయ్, జైనథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రభాకర్, వైస్ చైర్మన్ వేణుగోపాల్, డైరెక్టర్ బట్టు సతీష్, మహేందర్, భోజన్న, ఉషన్న, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

# యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

బోథ్: ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ కౌఠ(బి) గ్రామానికి చెందిన స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో గురువారం బోథ్ డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్సిటీ లేకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని అన్నారు. హైదరాబాద్, వరంగల్ నగరాలకు వెళ్లి చదువుకోవడం ఆర్థికంగా పెనుభారంగా మారుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేందర్, మణికంఠ, వెంకటేశ్, పవన్, గోడిసెల రమణా గౌడ్ పాల్గొన్నారు



వినతిపత్రం అందజేస్తున్న యువకులు

### నేడు విద్యార్థులకు నగదు పురస్కారం అందజేత

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా విద్యాశాఖ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులను ప్రభుత్వం నగదు పురస్కారానికి ఎంపిక చేసింది. జిల్లాలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన నలుగురు విద్యార్థులకు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో రాణించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నగదు పురస్కారాన్ని శుక్రవారం పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా అందుకోనున్నారు. పదో తరగతిలో ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడ మోడల్ స్కూల్ విద్యార్థి చిల్కూరి రమ, సట్లవార్ హరీశ్, జిల్లావార్ అజయ్, జెడ్పీఎస్ఎస్ కప్పర్లకు చెందిన విద్యార్థి గిజ్జ అనుశ్రీ, ఇంటర్‌లో బంగారుగూడ మోడల్ స్కూల్‌కు చెందిన బైపీసీ విద్యార్థి సుహాని, నార్నూర్ మోడల్ స్కూల్ బైపీసీ విద్యార్థి జగదీష్, కేజీబీవీ బోథ్ బైపీసీ విద్యార్థి చైతన్య, బోథ్ మోడల్ స్కూల్‌కు చెందిన షేక్ ఇలియాజ్ నగదు పురస్కారం అందుకోనున్నారు.

### అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని రాణిసతిజీ కాలనీలో జరుగుతున్న అక్రమ భవన నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. రాణిసతీజి మందిర్‌ను ఆనుకుని రోడ్డును ఆక్రమించి, డ్రెయినేజీ మళ్లించి ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాన్ని చేపడుతున్నారని ఆరోపించారు. రోడ్డు ఇరుకుగా మారి ప్రజల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న మనోజ్